అసంపూర్తి కారిడార్లతో అవస్థలు

- బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రమాదాల బారిన పాదచారులు



కంచరపాలెం నేతాజీ గ్రంథాలయం సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన కారిడార్లు

కంచరపాలెం : 'శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ' (బీఆర్‌టీఎస్)తో ప్రజా రవాణాలో ప్రత్యేకతను సంతరించుకునేందుకు, ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ రహదారులను నిర్మించారు. బీఆర్‌టీఎస్‌లో జేఎన్‌ఎన్‌ఆర్‌యూఎం బస్సుల కోసం నిర్మించిన ప్రత్యేక రహదారికి, సబ్‌వే మార్గాలకు అనుసంధానంగా కారిడార్లు ఏర్పాటు చేశారు. కంచరపాలెం కూడలి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, అటు జ్ఞానాపురం కాన్వెంటు కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రహదారిలో కారిడార్లు అసంపూర్తిగా నిర్మించడంతో ప్రయాణికులకు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నేతాజీ ఫ్లై ఓవర్ కూడలి, కంచరపాలెం రైతు బజార్, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో కారిడార్లు విరిగిపోయి నేలకొరిగిపోవడంతో రోడ్లు దాటే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కారిడార్లు నుంచి బీఆర్‌టీఎస్ మార్గాన సబ్‌వేలోకి వెళ్లేటప్పుడు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణించేటప్పుడు కారిడార్లు దాటే పాదచారులు ఒక్కసారిగా రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

మూలకు చేరిన కారిడార్లు

బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్లు తుప్పుపట్టి మూలకు చేరాయి. జోన్ – 5 ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కారిడార్లు మూలకు చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నేలకు ఒరగడంతో స్క్రాప్ దుకాణాలకు చేరుతున్నాయి. మిగిలిన కారిడార్లకు రంగులు వేస్తే కనీసం కొంత కాలం రహదారుల్లో నిలుస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కారిడార్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కంచరపాలెం రైతుబజారు వద్ద ప్రమాదకరంగా కారిడార్ దాటుతున్న పాదచారులు

కారిడార్లు ఏర్పాటు చేయాలి



బీఆర్‌టీఎస్ రహదారుల్లో కారిడార్ల వద్ద రోడ్లు దాటేటప్పుడు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు అతివేగంతో బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన మార్గాల్లో కారిడార్లు లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో సరిపెడుతున్నారు. – ఎస్.రమేష్, ఐటీఐ జంక్షన్

ప్రమాదాలు జరుగుతున్నాయి



కంచరపాలెం నుంచి మర్రిపాలెం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారుల్లో అసంపూర్తిగా కారిడార్లు వదిలేయడంతో ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అసంపూర్తి కారిడార్లపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు కారిడార్లు ఏర్పాటు చేయాలి.

– కె.పైడిరత్నాకర్, కంచరపాలెం

వైభవంగా దుర్గమ్మ, కుంచుమాంబ అమ్మవార్ల జాతర



ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ సమీప రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు కుంచుమాంబ, దుర్గమ్మ అమ్మవార్ల జాతర శ్రీరామ సేవా సమాజం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. తొలి పూజను గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ, ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాల అలంకరణతో కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో మూలవిరాట్ నుంచి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాలు, నడుమ అమ్మవారి ఊరేగింపు కనువిందుగా సాగింది. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా బెజవాడ కనకదుర్గమ్మ నవ దినోత్సవాలు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న దాసురాలు



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామ దేవత బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారి నవదినోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అమ్మవారి ఘటాలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదర్శించిన పులి వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన పరదేశమ్మ పండగ మహోత్సవాలు



పరదేశమ్మ ఆలయంలో కేకే రాజును సత్కరిస్తున్న అర్చకులు అనిల్ భవానీ, తదితరులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, తాటిచెట్లపాలెం సరిహద్దు ప్రాంతంలో గల పరదేశమ్మ ఆలయంలో జరుగుతున్న పండగ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రధాన పండగలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత కేకే రాజును ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడిరమణ, నాయకులు ఆళ్ల శివగణేష్, నూనెల పోలారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కరణవాది రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట : శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తీవ్రవాదులు జరిపిన బాంబు దాడిలో రాజీవ్‌గాంధీ మరణించారని, ఆ రోజును జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దేశ ప్రధానిగా పిన్న వయసులో బాధ్యతలు స్వీకరించిన రాజీవ్‌గాంధీ దేశంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, ఎస్. చాతుర్య , క్షీరాబ్ది దుతి, డాక్టర్ వై. లక్ష్మణరావు, దేవర చంద్రశేఖర్ రావు, గేదెల శ్రీహరి, ఎం ఆదినారాయణ, చరణ్, గౌరీ శంకర్, జి రాము, రమణ, మంగా, బంగారమ్మ పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు .

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



వివిధ రకాల పువ్వులతో రాస పోలమాంబ



కొత్త వస్త్రాలు, ఆభరణాలతో కొత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం తులసి మాలలు, సంపంగి, బొగడ, జరపర, డిసెంబర్, మల్లె పువ్వులు, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గుడ్డాల రాంబాబు, రమ్య సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదం అందించారు. జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని నూతన వస్త్రాలు, ఆభరణాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు.

ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరరావుకు సన్మానం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతంపేట: జిల్లా మలేరియా విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా సేవలందిస్తున్న సిహెచ్.నాగేశ్వరరావు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, భారతీయ రత్న వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్, అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్ ఇటీవల అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చేతుల మీదుగా అవార్డు గ్రహీత నాగేశ్వరరావును సత్కరించి అభినందించారు. జిల్లా మలేరియా అధికారి టి.తులసి మాట్లాడుతూ నాగేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులు తమకు అభిరుచి ఉన్న రంగంలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగభూషణం, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌ఈవో వెంకటేష్, సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అద్దంలా రహదారి



రాధాకృష్ణా లే అవుట్ నుంచి గణేష్‌నగర్‌కు వెళ్లే మార్గంలో అద్దంలా కనిపిస్తున్న డబుల్ రోడ్డు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని 14 వార్డులో రోడ్లు అద్దంలా దర్శనమిస్తున్నాయి. సీతమ్మధార, రాధాకృష్ణా లేఅవుట్ నుంచి గణేష్‌నగర్ వైపు వెళ్తున్న రోడ్డు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనక రోడ్డు నేషనల్ హైవేను తలపిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార : విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించేందుకు బుధవారం ఆశీలుమెట్ట ఆఫీస్ పరిధి 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్కు, 11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపట్టేందుకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ప్రాంతం, పోస్టాఫీస్, గాంధీనగర్, సత్యం జంక్షన్, బాలాజీ డాల్ఫిన్ హైట్స్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోండి



అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపునకు రీజినల్ లేబర్ కమీషనర్ (ఆర్ఎల్‌సీ) చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం వారు ఆర్ఎల్‌సీ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీ వచ్చినప్పటికి కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో పాటు డిఫాల్టర్లుగా మిగులుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపుపై యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు గళ్లా శంకర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.2 లక్షల సాయం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న హర్షిణి, తదితరులు

దాతల సాయం కోసం దుర్గాప్రసాద్ వేడుకోలు

తగరపువలస : అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్యానికి పలువురు దాతలు చేయూత అందిస్తున్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి పంచాయతీ ముమ్మనవానిపాలెం గ్రామానికి చెందిన 18 ఏళ్ల రాజాన దుర్గాప్రసాద్ ఈ నెల 10న తాటిచెట్టు పైనుంచి పడిపోవడంతో వైద్యులు బ్రెయిన్‌కు శస్త్రచికిత్స చేసినా ఇప్పటికీ అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. విశాఖలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఇంకా రూ.10 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. పేదవారైన తల్లిదండ్రులు గంగమ్మ, అప్పలరాజు వేడుకోలుతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్పందిస్తున్నారు. ముమ్మనివానిపాలెం గ్రామాన్ని ఆనుకుని ఆనందపురం మండలానికి చెందిన రామవరం పంచాయతీ ఉంది. ఈ గ్రామానికి చెందిన గంర్రెడ్డి హర్షిణి చొరవ తీసుకుని పంచాయతీలోని దాతల సాయంతో బాలుని చికిత్స కోసం తల్లిదండ్రులకు మంగళవారం రూ.2 లక్షలు అందించింది. ఆమే కాకుండా ఆనందపురం మండలంలోనే భీమందొరపాలెం, కోలవానిపాలెం పంచాయతీ వాసులు, బాలుని సొంత గ్రామమైన ముమ్మనివానిపాలెం గ్రామస్తులు కూడా స్పందించితలో కొంత నగదు సాయం అందిస్తున్నారు. ఇంకా దుర్గాప్రసాద్ వైద్యానికి సాయం అందించాలనుకునే వారు 91770 69270, 94949 19627 లో సంప్రదించాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జీతాలు చెల్లించకపోవడం ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమే..

అగనంపూడి: తొమ్మిది వందల కోట్ల రూపాయల అడ్వాన్స్ రూపేణా ఉక్కు యాజమాన్యం సేకరించినా నేటికి ఉక్కు ఉద్యోగులు జీతాలు చెల్లించకపోవడం, ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. 1,195 రోజులుగా ఆందోళన చేస్తున్నా, యాజమాన్యంలోగాని, ప్రభుత్వాల్లోగాని కనీసం స్పందన లేకపోవడం, కావాలని కార్మికుల జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడం అన్యాయమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉక్కులోని డెడికేషన్ పార్కు వద్ద బుధవారం ఉదయం పది గంటలకు వేలాది మంది కార్మికులు పాల్గొని నిరసన తెలపేందుకు నిర్ణయించామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో నియమితులైన ఉక్కు సీఎండీలు, డైరెక్టర్లు వివాదస్పదంగా వ్యవహరిస్తూ యథేచ్ఛగా షికార్లు చేస్తున్నారని, ఈ విషయంలో ఉక్కు మంత్రిత్వశాఖ చోద్యం చూస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై సీబీఐ, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు.

అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి : అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్ష అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి సంకీర్తనలను అంకితం చేసి కైవల్యం పొందారన్నారు. నేటి సమాజంలో సనాతన ధర్మం, భక్తి భావన దూరం అవుతున్నాయని, ఈ క్రమంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈనెల 24వ తేదీన సంకీర్తన యజ్ఞం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కాపారపు ఫౌండేషన్ ప్రతినిధి కాపారపు శివన్నాయుడు, భాస్కర్‌భట్ల సత్య ప్రసాద్‌శర్మ, బెండి సత్యం, శీపాన రమేష్‌బాబు, పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

క్లుప్తంగా

సేవలకు సత్కారం



కీర్తిపట్నాయక్‌ను సత్కరిస్తున్న ఒడిశా శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: స్థానిక శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్‌ను ఒడిశా భువనేశ్వర్ శిష్టకరణ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ సమావేశానికి ఆమెను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమె నిరంతరం చేస్తున్న సేవలు అద్వితీయమని సంఘం ప్రతినిధులు ప్రశంసించారు. అనంతరం ప్రముఖ శాస్త్రవేత్త, పసిఫిక్ ఆసియా అవార్డు గ్రహీత రఘుపాత్రుని భీమారావు చేతుల మీదుగా కీర్తిని సత్కరించారు. సంఘం కార్యదర్శి జక్కువ చక్రపాణి పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు లస్సీ పంపిణీ



లస్సీ పంపిణీ చేస్తున్న తాతాజీ, తదితరులు

సీతమ్మధార : ఎండల తీవ్రత ఎక్కువగా వుండడంతో నక్కవానిపాలెంలోని కనకదుర్గ ఆలయానికి వచ్చిన భక్తులు, ప్రజలకు తాతాజీ అనే భక్తుడు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లస్సీ పంపిణీ చేశారు. గుప్తాజీ అనే భక్తుడు సోడాలు పంపిణీ చేశారు. దీంతో భక్తులు, స్థానికులు లస్సీ, సోడాలు తాగి ఉపశమనం పొందారు.

23న చండీహోమం

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఈ నెల 23న గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే 27న సోమవారం ఉదయం 9 గంటలకు సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం



అలంకరణలో స్వామి ఉత్సవ విగ్రహం

భీమునిపట్నం : భీమిలి సౌమ్య గిరిపై ఉన్న నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాల అభిషేకాలు, గంగ, నర్మద, గోస్తనీ నదుల జలాలతో అభిషేకాలు నిర్వహించారు.